## కథ

# సాక్షి

గన్నవరపు నరసింహమూర్తి

పుష్యమాసపు రోజులు కావడంతో ఉదయం పదిగంటలైనా చలి తగ్గలేదు. ఆ సమయంలో మాఇంటిముందు వేపచెట్టుక్రింద కూర్చొని ఆ రోజు పేపరు చదువుతున్నాను. నేను సబ్‌యిన్స్‌పెక్టర్‌గా పదవీ విరమణ చేసి అప్పుడే ఆర్నెల్లవుతోంది. ప్రశాంతంగా ఉంటుందని మా పల్లెకు వచ్చి అక్కడి పాతింటిని బాగుచేయించి నేను నాభార్య సులోచనా అందులో ఉంటున్నాం. పిల్లఇద్దరూ జీవితంలో స్థిరపడిపోయి మాకు చాలా దూరంలో ఉంటున్నారు.

పేపరు చదువుతున్న నాకు మొదటి పేజీలో ప్రచురితమైన ఒకవార్త నన్ను ఆకర్షించింది. 'ప్రముఖ కంట్రాక్టర్ గిరిధర్ దారుణ హత్య! దొరకని హంతకులజాడ'అన్నది ఆ వార్త; ఎందుకంటే ఈ గిరిధర్ పేరునాకు సుపరిచితమే. అతను ఈ రాష్ట్రంలో ప్రముఖ కంట్రాక్టరే కాకుండా మాజీ శాసన సభ్యుని కొడుకు కూడా! యింతకీ హత్య చేయబడింది నాకు తెలిసిన గిరిధరో కాదో అన్న అనుమానం కలగడంతో ఆ వార్తని చదవడం మొదలు పెట్టాను.

"నిన్న రాత్రి అరకు-పాడేరు ఘాట్‌రోడ్‌లోని మూడవ మలుపు దగ్గర రాష్ట్రంలోని పేరుమోసిన కాంట్రాక్టర్, మాజీ ఎమ్మెల్యే కొడుకు అయిన గిరిధర్ దారుణ హత్యకు గురయ్యాడు! ఇది అర్ధరాత్రి పదకొండు-పన్నెండు గంటల మధ్య జరిగి ఉంటుందనిస్థానికపోలీసులు అనుమానిస్తున్నా రు. హంతకులు ఎవరన్నది యిప్పటిదాకా తెలియలేదనీ కేసును అన్ని కోణాలనుంచీ దర్యాప్తు చేస్తున్నామనీ, త్వరలోనే హంతకుల్ని పట్టుకుంటామనీ స్థానిక సి.ఐ రఘువీర్ మా న్యూస్ నోవిలేఖరికి చెప్పారు. హతుడు గిరిధర్ రెండు రోజుల క్రితమే ఈ ప్రాంతానికి హైదరాబాద్ నుంచీ వచ్చినట్లు సమాచారం!

అతనికి చెందిన హైటెక్ కనస్ట్రక్షన్ కంపెనీకి పాడేరు ఘాట్ రోడ్డు నిర్మాణ పనుల కాంట్రాక్ట్ రెండు నెలల క్రితమే దక్కిందనీ, ఆ పనుల పర్యవేక్షణ నిమిత్తమే అతను యిక్కడికి వచ్చాడనీ ఆ కంపెనీ ప్రతినిధులు మా విలేఖరికి చెప్పారు. రెండురోజుల క్రితం అతను రహదారుల శాఖ విశ్రాంతి గృహంలో దిగాడనీ, అతనికీ ప్రాంతంలో శతృవులెవ్వరూ లేరనీ వారు చెప్పడం గమనార్హం!

ఈ హత్య పనులు జరుగుతున్న ఘాట్‌రోడ్ సమీపంలో ఉన్న కాంట్రాక్ట్ కేంప్ దగ్గర జరిగిందని, హతుణ్ణి ఆ ప్రక్కనే మరుగుతున్న తారు ఉంచిన గొయ్యిలో తోసివేయడం వల్ల చనిపోయినట్లు, చూడటానికి శవం చాలా భయంకరంగా ఉందనీ మా విలేఖరి చెబుతున్నాడు."

ఆ వార్త చదివిన నేను ఒక్కసారిగా విభ్రాంతికి గురయ్యాను ఇతను నాకు తెలిసిన గిరధరే; అతను ఇంతటి దారుణ హత్యకు గురవడం నాకు చాలా బాధ కలిగించింది. నిజానికి గిరిధర్ పేరుని మా పోలీసు శాఖలో తెలియని వారుండరు. అతనిమీద ఒక హత్యానేరం, రెండు మానభంగపు కేసుతో సహా ఎన్నో కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నాకు ఆ క్షణం ఆరు సంవత్సరాల క్రితం రంపచోడవరంలో ఎస్సైగా పనిచేసినప్పుడు జరిగిన సంఘటన గుర్తుకు రాసాగింది.

× × ×

ఆరు సంవత్సరాల క్రితం నాకు రంపచోడవరం ఎస్సైగా బదిలీ అయింది. మొదట్లో ఆ ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లకూడదని అనుకున్నా మా ఎస్పీగారు పిలిచి చెప్పడంతో వెళ్లక తప్పింది కాదు. అక్కడ మైదాన ప్రాంతంలోకన్నా అతి తక్కువగా కేసులు మా స్టేషన్‌కి వస్తూ ఉండేవి. ఆ ప్రాంతం అంతా ఏజెన్సీ కావడంతో అక్కడ అత్యధికంగా అమాయకులైన గిరిజనులుండేవారు. ఆ ప్రాంతంలో అప్పుడు నక్సలైట్ల సంచారం ఎక్కువగా ఉండటంవల్ల ప్రభుత్వం ఐటీ డియ్యే (ఐ.టి.డి.ఎ) ద్వారా చాలావరకు అభివృద్ధి పనులు చేపట్టింది. ఒకసారి అభివృద్ధి అంటూ జరిగితే నక్సల్స్ ప్రభావం తగ్గిపోతుందని ప్రభుత్వ ఆలోచన.

ఆ విధంగా ఆ అభివృద్ధి పనులు చేసే నిమిత్తం ఎందరో కాంట్రాక్టర్లు, వారి మనుషులు అక్కడికి వస్తుండేవారు. అలా మైదాన ప్రాంత ప్రజల రాకపోకలు ఎక్కువవడంతో అక్కడ అసాంఘీక కార్యకలాపాలు పెరగడం మొదలైంది. ఆ సమయంలో నేను అక్కడ ఎస్సైగా జాయినవడంతో వీటిని అణిచివేసే బాధ్యత నామీద పడింది.

ఒకరోజు సాయంత్రం నేను స్టేషన్‌లో ఉండగా మా కానిస్టేబుల్ ఒకతను పిడుగులాంటి వార్త మోసుకొచ్చాడు! అక్కడకి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవిలో ఒక గిరిజన యువతిని ఎవరో దారుణంగా మానభంగం చేసి హత్యచేసినట్లు అతను చెప్పడంతో ఒక్కసారిగా ఎలర్ట్ అయ్యాను. ఈ విషయాన్ని నాపై ఉన్నతాధికారులకు ఫోన్లో చెప్పి హత్య జరిగిన ప్రదేశానికి మా కానిస్టేబుల్స్‌తో సహా బయలుదేరాను.

ఆ హత్యా స్థలాన్ని చేరడానికి మాకు అరగంటకు పైగా పట్టింది. ఆ ప్రదేశం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండటంచేత కొద్ది దూరంలో ఉన్న రోడ్డుపై జీపునాపి, అక్కడ నుంచి నడక మార్గంలో ఆ ప్రదేశానికి బయలుదేరాము. రోడ్డునుంచి ఫర్లాంగ్ దూరంలో దట్టమైన అడవి మధ్య కనిపించింది. ఆ గిరిజన యువతి శవం! ఎవరో ఆమెని మానభంగం చేస్తున్నప్పుడు ఆమె ప్రతిఘటించడంవల్ల హత్య చేసినట్లు శవాన్ని చూడగానే తెలుస్తోంది. ఆమె శవం ప్రక్కనే కట్టెలమోపు పడి ఉండటంవల్ల బహుశా కట్టెలకోసం అడవికి వచ్చినట్లు ఊహించాను. ఆమెది అక్కడికిదగ్గర్లోని ఏదో గిరిజన గూడెం అయ్యుంటుందని నాకనిపించింది.

ఆ హత్య జరిగిన ప్రదేశం అంతా చిందరవందరగా ఉండి, పొదలన్నీ వాడిపోయి ఉండటంతో ఆమె హత్యకు ముందు బాగా పెనుగులాడినట్లుగా ఊహించాను. అలా ఆ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నా దృష్టి దూరంగా పొదల్లో వేలాడుతున్న గొలుసుమీద పడింది. దాన్ని పరిశీలించగానే కొన్ని విషయాలు తెలిసాయి. అది ఒంటిపేట బంగారు గొలుసు, మధ్యలో ఆంజనేయుడి లాకెట్ తగిలించి ఉంది. నాకెందుకో అది ఈ కేసులో బలమైన ఆధారం కాబోతోందని ఆ క్షణంలో అనిపించింది. ఆ తరువాత ఆ ప్రదేశం అంతా ఫొటోలు తీసి శవందగ్గర ఒక కానిస్టేబుల్ని కాపలా ఉంచి స్టేషన్‌కి తిరిగి వచ్చాను. అప్పటికి రాత్రి ఏడుగంటలైంది.

నేను స్టేషన్‌కి చేరుకునే సరికి ఒక యువకుడు బయట ఉన్న బెంచిమీద కూర్చొని మాకోసం ఎదురుచూస్తూ కనిపించాడు. అతను చూడటానికి గిరిజనుడిలా ఉన్నా ఫేంట్, షర్ట్ వేసుకొని ఉండటం వల్ల చదువుకున్న వాడని గ్రహించాను. అతన్ని నా గదిలోకి పిలిచి విషయాన్ని అడిగాను. అతని ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్లు కనిపించింది. అతను వివరాలు చెప్పడం మొదలుపెట్టాడు.

"నా పేరు రాందేవ్! మాది యిక్కడికి దగ్గర్లోని జన్నిగూడెం, ఇక్కడి ఘాట్‌రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ దగ్గర మిక్చర్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. నాకు అసిరామ్మ అని ఒక చెల్లెలుంది. రెండు రోజుల క్రితం మా కాంట్రాక్టర్ గిరిధర్ యిక్కడి కొచ్చాడు. ఈ రోజు నాచెల్లెలు కట్టెలకోసం అడవికెళ్తే ఆ గిరిధర్ నాకొడుకు దాన్ని పాడుచేసి చంపేడు సార్!" అతను చెబుతుంటే మాటలు తడబడ్డం గమనించాను. అతనిలో ఆవేశం కొట్టొచ్చినట్లు కనిపించసాగింది.

"రాందేవ్! మీ చెల్లెల్ని ఆ గిరిధరే చంపేడని నీ కెలా తెలిసింది?' కాసేపటికి అతని ఆవేశం తగ్గిన తరువాత అడిగాను.

'ఈ రోజు మా సైటులో మిక్చర్ మిషన్ పాడైపోవడంతో త్వరగా పనులు కట్టేసి నాలుగు గంటలవుతుండగా యింటికి బయలు దేరాను. నేను రోడ్డుమీదనుంచి వస్తుంటే కొద్దిదూరంలో రోడ్డు ప్రక్కన మా కాంట్రాక్టర్ గిరిధర్ నల్లని జీపు ఆగి ఉండటం కనిపించింది. ఆ సమయంలో అడవి మధ్యలో ఆజీపు అక్కడ ఎందుకు ఆగిఉందోనన్న అనుమానం నాకొచ్చి ఆజీపు దగ్గరకు వెళ్ళాను.

'ఇంతలో ఆ ప్రక్కనున్న అడవిలోంచి ఆ గిరిధర్ పరుగు పరుగున రావడం, ఆ జీపు ఎక్కిచాలాస్పీడుగావెళ్ళిపోవడం గమనించాను. అతనుజీపు దగ్గరికి వస్తున్నప్పుడు అతని చొక్కాపూర్తిగా చిరిగి పోయి ఉండటం అతని ముఖం మీద రక్తపు మరకలుండటం నా కంట పడింది. నా కెందుకో అతని వాలకం చూసి ఏదో జరిగి ఉంటుందని అనుమానం వచ్చి అతను వచ్చిన దార్లోంచి లోపలికెళ్ళి చూస్తే కొద్ది దూరంలో మా చెల్లెలి శవం కనిపించింది. ఆ దొంగ నాకొడుకే నా చెల్లిని చంపేడనీ నాకు వెంటనే అర్ధమైందయ్యా! అందుకే మీరువాడినెలాగైనా పట్టుకొని అరెస్ట్ చేసి జైల్లో పెట్టండి, లేకపోతే నాచెల్లెలి ఆత్మ క్షోభిస్తుందిబాబూ' అంటూ నా కాళ్ళు పట్టుకోబోయాడు!

నేను అతన్ని వారించి మరికొన్ని ప్రశ్నలు వేశాను. 'మీ చెల్లెల్ని ఆ గిరిధరే హత్య చేశాడని నువ్వు పూర్తిగా నమ్మినపుడు అతన్ని వెంబడించే ప్రయత్నం చేయలేదా?' నా ప్రశ్న అతన్ని అయోమయంలో పడేసింది; వెంటనే సర్దుకొని చెప్పడం మొదలుపెట్టాడు.

'ఆ గిరిధర్ గురించి యిప్పటికే ఎన్నో కథలు విన్నాను. వాడు నా చెల్లెల్లాంటి వాళ్ళని ఎంతో మందిని పాడు చేసి పొట్టన పెట్టుకున్నాడని మా సైటులోని చాలా మంది పని వాళ్ళు చెప్పారు. ఆ విషయం గుర్తొచ్చిన వెంటనే వాణ్ణి వెంబడించే ప్రయత్నం చేసాను. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. అయితే అదృష్ట వశాత్తూ వాడి జీపు దగ్గర్లోనే ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్ట్ గేటుని గుద్దేయడంతో ఆ గేటు దగ్గర ఆగి ఉండడాన్ని గమనించాను. కానీ ఈ లోపున వాడు వాళ్ళకి డబ్బులిచ్చేసి జీపులో పారిపోయాడు; అయ్యా! మీకేవిధమైన సాక్ష్యం కావాలన్నా నేను యిస్తాను. కోర్టులో ఎలా సాక్ష్యం చెప్పమంటే అలా చెబుతాను. కాబట్టి మీరు ఆ దొంగనాకొడుకుని ఎలాగైనా పట్టుకోండి' అంటూ ముఖానికి చేతులు అడ్డు పెట్టుకొని పెద్ద పెట్టున ఏడవటం మొదలుపెట్టాడు.

ఆ సమయంలో రాందేవ్‌ని ఓదార్చడం నాకు తలకు మించిన భారం అయింది. మా కానిస్టేబుల్ని పిలిచి అతని దగ్గర్నుంచి జరిగిన నేరాన్ని వివరంగా వ్రాయించి ఒక ఫిర్యాదును తీసుకొమ్మని చెప్పాను. ఆ విధంగా గిరిధర్‌మీద మా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ ని నమోదు చేసాను.

===

ఆ మర్నాటి నుంచి ఆ కేసును నేనే స్వయంగా పరిశోధించడం మొదలు పెట్టాను. సరియైన ఆధారాలు లేకుండా అటువంటి ప్రముఖుణ్ణి అరెస్ట్ చేస్తే మా శాఖ చాలా యిబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిసి పూర్తి సాక్ష్యాధారాలుసేకరించాలని నిర్ణయిం చుకున్నాను.

ఎలాగూ హత్యా ప్రదేశంలో లాకెట్ దొరికింది కాబట్టి అది ఎవరిదో తెలుసుకుంటే ఈ కేసులో చిక్కుముడి చాలా వరకు విడిపోతుంది. అదీగాక అతను పారిపోతున్నప్పుడు అతని జీపు ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌ని ఢీ కొందని రాందేవ్ చెప్పాడు కాబట్టి ఆ సాయంత్రం ఏం జరిగిందో వివరాలు తెలుసుకోవాలని చెక్‌పోస్ట్‌కు వెళ్ళి ఆ సిబ్బందిని విచారించాను. వాళ్ళ రిజిస్టర్‌లో ఐదుగంటల పది నిమిషాలకు చెక్‌పోస్టు గేటును ఢీ కొందనీ,

ఆ సమయంలో ఆ జీపుని నడుపుతున్న డ్రైవర్ పేరు గిరిధరనీ వివరాలన్నీ అందులో పొందుపరచబడి ఉన్నాయి. ఆ వివరాలన్నీ వ్రాత పూర్వకంగా వాళ్ల దగ్గర్నుంచి స్టేట్‌మెంట్ రూపంలో తీసుకున్నాను. అది రేపు కోర్టులో కీలకమైన సాక్ష్యం కాబోతోందని నాకు తెలుసు.

మర్నాడు రాందేవ్‌ని స్టేషన్‌కి పిలిచి జరిగిన విషయాన్ని స్టేట్‌మెంట్ రూపంలో తీసుకున్నాను. ముందుముందు ఈ కేసులో అతనే కీలకమైన సాక్షి కాబట్టి ఈ వాఙ్మూలం చాలా ముఖ్యం; ఆ తరువాత గిరిధర్ ఈ ప్రాంతానికి ఎప్పుడొచ్చాడో అన్నది ముఖ్యం కాబట్టి అటవీ శాఖ వసతి గృహానికి వెళ్లి రిజిస్టర్‌ని చూస్తే అతను మూడు రోజుల క్రితమే వచ్చినట్లు మళ్లీ హత్య జరిగిన రోజు రాత్రి ఏడుగంటలకు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు వివరాలు అందులో పొందుపరచబడి ఉన్నాయి. అక్కడ ఉన్న వాచ్‌మేన్‌ని విచారిస్తే ఆరోజు రాత్రి ఆరుగంటలప్పుడు గిరిధర్ చాలా ఆందోళనతో వచ్చాడనీ, వచ్చిన ఐదు నిమిషాలకే సామాన్లన్నీ జీపులో పడేసి వెళ్లిపోయాడని చెప్పాడు. గిరిధర్ ఆ ప్రదేశానికి ఎప్పుడు వచ్చినా అదే విశ్రాంతి గృహంలో బస చేస్తాడు. కాబట్టి గిరిధర్ గురించి అతనికి బాగా తెలిసి ఉంటుందని భావించి ఆ లాకెట్‌ని అతనికి చూపించగానే అది గిరిధర్ మెడలో ఉండగా తాను చాలాసార్లు చూసానని చెప్పడంతో ఆ వివరాలన్నీ అతడి దగ్గర్నుంచీ వ్రాత పూర్వకంగా తీసుకున్నాను.

ఇప్పుడు గిరిధర్ చుట్టూ వల బిగించాను. గిరిధర్ని హంతకుడనీ నిరూపించడానికి కావలసిన సాక్ష్యాధారాలు నా దగ్గర ఉన్నాయి. ఈ వివరాలు మా ఎస్పీగారికి చెప్పడంతో గిరిధర్ అరెస్ట్‌కి ఆయన పచ్చజెండా చూపాడు! ఆ మర్నాడే గిరిధర్‌ని అరెస్ట్ చేసాను.

× ×

అధికార పార్టీ శాసన సభ్యుడి కొడుకు హత్యానేరంలో స్వయంగా యిరుక్కొని అరెస్ట్ కాబడటంతో అది రాష్ట్రంలో పెనుదుమారం రేపింది! అతను రిమాండ్‌లో ఉండగానే సేకరించిన సాక్ష్యాధారాలతో ఛార్జి షీటుని దాఖలు చేశాను. ఆ తరువాత గిరిధర్ బెయిల్ మీద విడుదలయ్యాడు. ఆ తరువాత మూడు నెలలకి ఆ కేసు సెషన్స్‌కి వచ్చింది.

× × ×

ఈ కేసులో రాందేవ్ ముఖ్యసాక్షి కాబట్టి అతన్ని ఒకరోజు స్టేషన్‌కి పిలిచి "రాందేవ్! నీ చెల్లెల్ని మానభంగం చేసి హత్య చేసిన ఆ గిరిధర్‌కి శిక్ష పడాలంటే నీ సాక్ష్యమే కీలకం! కాబట్టి నువ్వు జాగ్రత్తగా ఉండాలి. కోర్టులో జరిగింది జరిగినట్లుగా చెప్పాలి. అంతవరకు నువ్వు ఈ ఊరు వదలి ఎక్కడికీ వెళ్లకూడదు; నీకు కావలస్తే పోలీసు రక్షణ యిస్తాను" అనిచెప్పడంతో అతను ఒప్పుకున్నాడు.

కేసు కోర్టులో ప్రారంభమైంది. రెండునెలలపాటు వాదోపవాదాలు చాలా తీవ్రంగా జరిగాయి. వాదోపవాదాలు జరిగినన్నాళ్లూ రాష్ట్రంలోని అన్ని న్యూస్ ఛానళ్లు, పేపర్లు బాగా కవరేజి యివ్వడం వల్ల ఆ కేసు చాలా ప్రాముఖ్యతని సంతరించుకుంది. మా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కి నేనే దగ్గరుండి అన్ని విషయాల్లో సహాయం చేస్తుండటంతో నా పేరు కూడా రానురాను ప్రాముఖ్యతని సంతరించుకోసాగింది. "అధికార పార్టీ అవినీతికి ఎదురొడ్డిపోరాడుతున్న పోలీసు సింహం! నిజాయితీకి, ధైర్యానికి నిలువెత్తు నిదర్శనం" అంటూ అధికార పార్టీకి ఎప్పుడూ వ్యతిరేకంగా వార్తలురాసే ఒకపత్రిక ఏకంగా నా ఫోటోతో సహా ఒక వార్తను బాక్స్ ఐటమ్‌గా ప్రచురించడంతో నా పేరు రాష్ట్ర స్థాయిలో చాలా మందికి సుపరిచయమైంది.

కానీ ఈ కేసులో చివరకు మాకు ఎదురుదెబ్బ తగిలింది! చివరి రోజున రాందేవ్ సాక్ష్యం చెప్పవలసి రావడంతో అతనికి కోర్టులో ఏం చెప్పాలో అన్నీ వివరంగా చెప్పి పూర్తి బందోబస్తుతో అతన్ని కోర్టుకి తీసుకువచ్చాము. కానీ విచిత్రంగా కోర్టులో రాందేవ్ మాకు ఎదురు తిరగడంతో కేసు పూర్తిగా తారుమారైంది! అంతవరకు గిరిధర్‌కి ఉరిశిక్ష ఖాయం అనుకున్నదల్లా అతను వ్యతిరేక సాక్ష్యంవల్ల కేసు మా చేయి జారిపోయింది. ఈ కేసులో పూర్తిగా సహకరిస్తానన్న రాందేవ్ కోర్టులో 'తనకేమీ తెలియదనీ, తనను పోలీసులు భయపెట్టి బలవంతంగా స్టేట్‌మెంట్ మీద సంతకం చేయించారనీ జడ్జిముందు చెప్పడంతో గిరిధర్ నిర్దోషిగా బయట పడ్డాడు. జడ్జిగారు తన తీర్పులో "పోలీసు శాఖ సరియైన సాక్ష్యాలు సేకరించడంలోవిఫలమైందనీ మంద లించడంతో మా శాఖతో పాటు నా పరువుకూడా మసకబారిపోయింది. మాశాఖ ఉన్నతాధికారు ల ముందు తలవంచుకోవలసిన పరిస్థితి నాకెదురైంది.

తన చెల్లిని చంపిన వాణ్ణి శిక్షించడానికి మాతో పూర్తిగా సహకరిస్తానన్న రాందేవ్ ఎందుకిలా ప్రవర్తించాడో నాకోపట్టాన అర్థం కాలేదు. ఆ తరువాత మా పరిశోధనలో గిరిధర్ యిచ్చిన పదిలక్షల రూపాయలకు ఆశపడి ఎదురుతిరిగాడని వెల్లడైంది. వారం రోజుల తరువాత వాణ్ణి స్టేషన్‌కి పిలిచి "నిన్ను సాక్ష్యం చెప్పొద్దంటూ గిరిధర్ నీకు డబ్బులిచ్చిన మాట నిజమేనా? అదే నిజమైతే ఒక అన్నగా నీచెల్లికి చాలా ఘోరమైన అన్యాయం చేసావ్! యింతకు యింతా నువ్వు అనుభవిస్తావ్" అంటూ వాడిమీద విరుచుకు పడ్డాను.

నా మాటలు విన్న రాందేవ్ చాలా సేపటి వరకు దించిన తల ఎత్తలేదు. ఆ తరువాత మౌనాన్ని వీడి "యిప్పుడు మీకు ఏ విషయం చెప్పేస్థితిలో లేను బాబూ! నిజా నిజాలు నాకూ ఆ దేవుడికీ తెలుసు! ఏదో ఒకరోజు నేనే మీ దగ్గరకు వచ్చి అన్ని విషయాలు స్వయంగా చెబుతాను. నన్ను వదిలేయండి" అంటూ కంటతడితో రెండు చేతులూ జోడించి వేడుకున్నాడు.

ఆ తరువాత కొద్దిరోజులకే అధికారపార్టీ శాసన సభ్యుడికి వ్యతిరేకంగా కేసుని చేపట్టడం వల్ల ఆ శాసనసభ్యుడు నాపై కక్ష పెట్టుకొని నాకు బదిలీ చేయించాడు. అలా విశాఖకు బదిలీ మీదవచ్చి అక్కడే మిగతా కాలమంతా పనిచేసి పదవీ విరమణ చేసాను. ఆ తరువాత నేనూ, నా భార్య మా పల్లెకొచ్చి ప్రశాంతంగా కాలాన్ని గడుపుతున్నాం.

తరువాత మళ్లీ యిన్నాళ్లకు గిరిధర్ హత్యవార్త పేపరులో రావడంతోనాకు గతం అంతా గుర్తుకొచ్చింది. ఆ సమయంలో నాకెందుకో రాందేవ్ గుర్తుకొచ్చాడు. ఆ తరువాత ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోయాను.

× × ×

ఈసంఘటనజరిగిన నెల్లాళ్లకనుకుంటాను. ఒకరోజు ఉదయాన్నే రాందేవ్ మా యింటి కొచ్చాడు. అతన్ని మొదటనేను గుర్తు పట్టలేకపోయాను. ఆ తరువాత గుర్తుపట్టి ఎందుకొచ్చాడోనని ఆశ్చర్యపోయాను. కొద్దిసేపటి తరువాత వాడే వివరాలు చెప్పడం మొదలుపెట్టాడు.

"ఆనాడు కేసు కోర్టులో ఉండగా గిరిధర్ తన మనుషులతో మా యింటికొచ్చి కోర్టులో అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే నాతోబాటు

మా అమ్మ, నాన్నల్ని చంపేస్తామని బెదిరించాడు! అదీగాక కోర్టులో తనకేమీ తెలియదని చెబితే పదిలక్షల రూపాయలు యిస్తానన్నాడు! అనడమే కాదు డబ్బుతో ఉన్న పెట్టెను నాకిచ్చాడు కూడా!" చెబుతూ మధ్యలో ఆగాడు రాందేవ్. కొద్దిగా మంచినీళ్లు త్రాగిన తరువాత మళ్లా చెప్పడం మొదలు పెట్టాడు.

"ఆ సమయంలో ఆ నీచుణ్ణి చూడగానే వాడి చేతిలో దారుణంగా మానం కోల్పోయి చంపబడ్డ నా చెల్లెలి అమాయకపు ముఖం గుర్తుకొచ్చింది సార్! వాణ్ణెంచి తప్పించుకోవాలని అది చేసిన ఆర్తనాదాలు నా చెవిలో మార్మోగాయి.

కానీ ఆడబ్బులు తీసుకోకపోతే మా కుటుంబాన్ని చంపేస్తారని భయపడే ఆ డబ్బుని తీసుకున్నాను; గత్యంతరం లేకే వాడికి అనుకూలంగా సాక్ష్యం చెప్పాను; నా చెల్లెలి హంతకుణ్ణి శిక్షించడానికి వరంలా వచ్చే అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నాను" అంటూ ఏడవటం మొదలుపెట్టాడు. కాసేపటికి మామూలై " ఆ సమయంలో నేనొక నిర్ణయానికి వచ్చాను బాబూ! వాడిచ్చిన డబ్బుతోనే వాణ్ణి చంపాలనుకున్నాను. ఒకవేళ వాడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినా వాడు యింకో పెద్ద కోర్టుకి వెళ్లి పెద్ద పెద్ద లాయర్లను పెట్టి శిక్ష నుంచి తప్పించుకుంటాడు. వాడుగానీ మళ్లీ బయట పడితే నాచెల్లెలాంటి అభాగినులెందరో మళ్లీ వాడి దుర్మార్గానికి బలౌతారు; అలా జరగకూడదనే నా ఆలోచన; అందుకే వాడిచ్చిన డబ్బు తీసుకొని ఈ ప్రాంతానికి వలస వచ్చేసాము" చెబుతూ కాసేపు ఆగాడు.

"మరి మొన్న గిరిధర్ హత్య"?! నా ప్రశ్న ముగియకముందే" నేనే చేయించాను సార్! వాడిచ్చిన డబ్బుల్లో ఐదులక్షల రూపాయలు ఒక బీహారీ క్రిమినల్ కిచ్చి చేయించాను. వాడు రోడ్డు పనులు చేయడానికని అక్కడికి వెళ్లి అదను చూసి వాణ్ణి మరుగుతున్న తారు గొయ్యిలో తోసేసి చంపి పారిపోయాడు. వాడు పోలీసులకు దొరకడం కల్ల" అంటూ చాలా ఉద్రేకంగా చెప్పుకుపోతున్నాడు.

రాందేవ్ మాటలు వింటుంటే నాకు ముచ్చెమటలు పోయసాగాయి! ఎంతో అమాయకంగా కనబడే రాందేవ్ యింత పకడ్బందీగా హత్య చేయించడం నాకు మింగుడు పడటం లేదు.

"కానీ నువ్వు చేసిన పని చట్ట వ్యతిరేకం రాందేవ్" అన్నాను.

"సార్! మీరు చాలా నిజాయితీ పరుడైన నిప్పులాంటి పోలీసు అధికారి; కానీ ఆరోజు నేను మీకు ఎదురుతిరిగి చాలా చెడ్డపేరు తీసుకొచ్చాను. దానికి నేనెంతో కృంగిపోయాను. ఆ రోజు కేసు వీగిపోయినప్పుడు కోర్టు ఆవరణలో మీరు నన్ను తీక్షణంగా చూసిన చూపు నిజంగా దహించి వేసింది!" కానీ ఆనాడూ ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితినాది!" చెబుతూ ఆగిపోయాడు రాందేవ్. చాలాసేపటి వరకు మా మధ్య నిశ్శబ్దం! తరువాత నోరు విప్పాడు.

"మీరు చెప్పినట్లు వాణ్ణి చంపించినందుకు నేను చట్టప్రకారం దోషినే! కానీ నా చెల్లెల్ని అతికిరాతకంగా పాడుచేసి చంపినందుకు న్యాయం ప్రకారం నేను చేసింది ఒప్పే ననుకుంటున్నాను. చట్టానికి చెవులే గానీ కళ్లుండవంటారు. కానీ న్యాయానికి మాత్రం వేలకళ్లుంటాయి బాబూ!నేను చేసింది మీ దృష్టిలో తప్పైతే క్షమించండి" అంటూ నేనేదో చెబుదామనుకుంటుండగానే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ముప్పై సంవత్సరాలపాటు పోలీసు శాఖలో పనిచేసిన నాకువాడు చెప్పేదాకా చట్టానికీ, న్యాయానికీ మధ్య ఉన్న అతి సున్నితమైన, సన్నని విభజన రేఖని గుర్తించలేకపోయాను. ఆనాడు డబ్బు గిరిధర్ ప్రాణాన్ని కాపాడితే అదే డబ్బు ఈనాడు వాడి ప్రాణాన్ని బలిగొంది.

ఆనాడు చట్టం ముందు న్యాయం ఓడి పోయింది! కానీ ఈనాడు న్యాయం గెలిచిందా?!

ఇంతకీ ఈ నా ఆలోచన సరియైనదేనా?!

# పాటే మంత్రము

## మెరుగు రాధాకృష్ణమూర్తి

గగనాన నిలిచిన ఓ ఘనాపాటీ
గగనస్థాయి మీ పాటకు జేజేలు కోటి
లేరు లేరెవరయ్యా మీ బోటి
రారు రారెవరయ్యా మీకు సాటి
ఏ యుగాన్నైనా మీరు మేటి
జాతీయస్థాయిన నిలిచింది మీ పాట చాటి
ఏ పాటైనా మీకు ఏ పాటి
ఏ తరాన్నైనా నిలిచి గెలిచారు పోటాపోటీ
ఏనాడైనా రాయలేదు పిచ్చాపాటి
ఏనాటికీ మీ పాటకే అక్షర నీరాజనాలు శతకోటి
మీ పాటే మంత్రమై ప్రభవించింది
ప్రేక్షక కోటి హృదయాల్లో పల్లవించింది
అక్షరమైన నడిపించు కవుల కలాన
గంధమై పరిమళించు గాయకుల గళాన
మసకబార రాదు వెండితెర వైభోగం
చెదర రాదు తెలుగు సినీపాట వైభవం
అందుకే-
దేవాది దేవుళ్ళనైనా మెప్పించి ఒప్పించి
మన్నించి తీర్చు మా కోర్కె మరల జన్మించి! మరల జన్మించి!!
(పాటకే పల్లవైన పాటలు వేటూరికి అక్షర నివాళులతో)